# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 01-05-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భూమి మీద యజమానికి సంపూర్ణ హక్కు ఇవ్వాలన్న ఉద్దేశ్యంతోనే ల్యాండ్ టైటిలింగ్ చట్టం తీసుకువచ్చామని వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పేర్కొన్నారు.
- ❖ టీడీపీ అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమాన్నీ సమతుల్యం చేస్తూ పాలన సాగిస్తామని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.
- ❖ ఏప్రిల్ నెలలో స్థూల వస్తు సేవల పన్ను వసూళ్లు గరిష్ఠానికి చేరాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.
- ❖ రాష్ట్రంలో రాయలసీమ జిల్లాల్లో తీవ్ర వడ గాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ సూచించింది.

==============================

భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య రామాలయాన్ని సందర్శించనున్నారు. ఇందులో భాగంగా ఢిల్లీ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి అయోధ్య చేరుకున్నారు. అక్కడ నూతనంగా నిర్మించిన రామాలయాన్ని తొలిసారిగా రాష్ట్రపతి దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. దర్శనం తరువాత శ్రీ హనుమాన్ గర్హ ఆలయం, ప్రభు శ్రీరామ్ ఆలయం, కుబీర్ తీలలను రాష్ట్రపతి దర్శించుకోనున్నారు. అనంతరం హారతి, సరయు నదీ పూజ వంటి కార్యక్రమాల్లో కూడా రాష్ట్రపతి పాల్గొనబోతున్నారని అధికారిక వర్గాలు తెలిపాయి.

==============================

భూమి మీద యజమానికి సంపూర్ణ హక్కు ఇవ్వాలన్నదే ల్యాండ్ టైటిలింగ్ చట్టం ముఖ్య ఉద్దేశ్యమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ల్యాండ్ టైటిలింగ్ చట్టం అమలుతో ప్రజలకు వారి భూములపై పూర్తి హక్కులు లభిస్తాయని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ రోజు బొబ్బిలి, పాయకరావుపేట, ఏలూరులో జరిగిన సభలలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో వందేళ్ల

తరువాత భూ సర్వే చేపట్టామని చెప్పారు. కాగా, రాబోయే ఐదేళ్ల భవిష్యత్తును నిర్ణయించేవే ఎన్నికలు అని అన్నారు. ప్రజలు అన్నీ ఆలోచించి ఓటు వేయాలని కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే అభివృద్ధి, సంక్షేమాన్నీ సమతుల్యం చేస్తూ పాలన సాగిస్తామని ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. బాపట్ల జిల్లా చీరాలలో ఈ రోజు నిర్వహించిన "ప్రజాగళం" ఎన్నికల సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల ఆశలు, ఆకాంక్షలకు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రాధాన్యత ఇచ్చామని అన్నారు. ప్రగతి బాటన రాష్ట్రాన్ని నడిపిస్తామని ఆయన తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలో ఏప్రిల్ నెలలో స్థూల వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు గరిష్ఠానికి చేరాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ ఈ రోజు తెలిపింది. గత ఏడాదితో పోలిస్తే 12.4 శాతం పెరిగి 2.10 లక్షల కోట్లు రూపాయలుగా నమోదయ్యాయని వివరించింది. దేశీయంగా ఆర్థిక లావాదేవీలు 13.4 శాతం మేర పెరగడం కూడా ఇందుకు మరో కారణం అని ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. కాగా, 2017 జులైలో జీఎస్‌టీ విధానం అమల్లోకి వచ్చాక నెలవారీ వసూళ్లకు సంబంధించి ఇదే అత్యధిక మొత్తంగా ఉందని పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రాష్ట్రంలో రాయలసీమ జిల్లాల్లో తీవ్ర వడ గాలులు వీచే అవకాశం ఉందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. అలాగే, ఉత్తర దక్షిణ కోస్తా జిల్లాల్లో కొన్ని చోట్ల వడగాలుల ప్రభావం అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ అధికారి వివరిస్తూ...

(వాయిస్ 28 సెకన్లు)

ఇదిలా ఉండగా, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పాడేరు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎండల తీవ్రతతో పాటు, వడగాలుల ప్రభావం కారణంగా పగటి వేళలలో ఇళ్లలో నుండి ఎవరూ బయటకు వెళ్లకూడదని హెచ్చరించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విజయనగరం జిల్లాలో రెండో ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను కేటాయించారు. జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు హనీష్ చాబ్రా, తలాత్ పర్వేజ్ ఇక్బాల్ రోహెల్లా, సీతారామ్ జాట్ సమక్షంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి కలెక్టరేట్ ఎన్ఐసి కేంద్రంలో ఈరోజు ఈ ప్రక్రియ నిర్వహించారు. కంప్యూటర్ ర్యాండమైజేషన్ ద్వారా ఆయా నియోజకవర్గాల్లోని పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలను ఎంపిక చేశారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కార్మికులకు ఒక రోజు ఉంది. వారు చిందించే చమటకు ఒక గుర్తింపు ఉంది. అదే మేడే. అంతర్జాతీయ కార్మిక దినోత్సవంగా ప్రతీ ఏటా మే 1వ తేదీన జరుపుకుంటారు. ఇది కార్మికులకు పండుగ లాంటి రోజు. కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం గురించి నినదిస్తూ 1886 మే 1న చాలా మంది కార్మికులు పోరాటం చేపట్టారు. అలా మొదలైన

పోరాటం అనేక దేశాలకు విస్తరించి 1890 వరకు సాగింది. ఆ తరువాత కార్మికులకు ఎనిమిది పని గంటల విధానం అమలు అయింది. దానికి గుర్తుగా 1890 మే 1 నుంచి ప్రపంచ వ్యాప్తంగా మేడే ఉత్సవాలను ప్రతీ ఏటా నిర్వహిస్తున్నారు. కాగా, అంతర్జాతీయ కార్మిక దినోత్సవాన్ని రాష్ట్రంలో ఈ రోజు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు కర్మాగారాలలో కార్యక్రమాలను నిర్వహించారు. విశాఖ స్టీల్ ప్లాంట్ తో పాటు పలు ప్రభుత్వరంగ సంస్థలలో కార్యక్రమాలు నిర్వహించారు.

==============================

కృష్ణ జిల్లాలో రేపటి నుంచి 8వ తేదీ వరకు హోమ్ ఓటింగ్ బృందాలు ఇంటింటికి వెళ్లి హోం ఓటింగ్ నిర్వహిస్తాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డీకే బాలాజీ తెలిపారు. పాత్రికేయులతో ఈ రోజు ఆయన మాట్లాడుతూ, ఇంకా ఎవరైనా హోమ్ ఓటింగ్ వినియోగించుకోని వారికి ఈ నెల 9, 10 తేదీల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారన్నారు. కాగా, జిల్లాలో ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

==============================

రాష్ట్రంలోని వివిధ జిల్లాలలో సామాజిక పెన్షన్లు పంపిణీ ఈ రోజు ప్రారంభం అయింది. బ్యాంకు ఖాతాలు ఉన్న లబ్ధిదారులకు నగదుని ఆయా ఖాతాలకు అధికారులు జమ చేస్తున్నారు. ఖాతాలు లేని వారికి ఇంటి వద్దనే పెన్షన్లు అందించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇదిలా ఉండగా, జిల్లా వ్యాప్తంగా సామాజిక భద్రత పెన్షన్ పంపిణీ సజావుగా జరుగుతోందని తిరుపతి జిల్లా కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. తిరుపతి నగరంలో కొనసాగుతున్న పెన్షన్ పంపిణీ ప్రక్రియను ఈరోజు ఉదయం కలెక్టర్ ప్రవీణ్ కుమార్ తనిఖీ చేశారు.

==============================

శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట అసెంబ్లీ సెగ్మెంట్లకు సంబంధించిన ఈవీఎం యంత్రాల రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం ఆన్‌లైన్ విధానం ద్వారా పూర్తి పారదర్శకంగా ర్యాండమైజేషన్ పూర్తి చేశామని పేర్కొన్నారు. ఎన్నికల పరిశీలకులు శేఖర్ విద్యార్థి మాట్లాడుతూ, మొదటి దశ ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియ జిల్లా ఎన్నికల అధికారి సమక్షంలో, రెండవ దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో జరిగిందన్నారు.

==============================

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులందరూ తప్పకుండా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన వివరాలను రిజిస్టర్లలో నమోదు చేయాలని విశాఖ పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలకులు రెంగరాజన్ పేర్కొన్నారు. ఈరోజు కలెక్టరేట్ లో విశాఖ పార్లమెంటు పరిధిలో పోటీ చేస్తున్న అభ్యర్థులందరితో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అన్ని కార్యకలాపాలను ప్రత్యేక బ్యాంకు ఖాతా ద్వారా మాత్రమే చేపట్టాలని సూచించారు.

==============================

రాష్ట్రాభివృద్ధి లక్ష్యంగా తెలుగుదేశం, జనసేన, భారతీయ జనతా పార్టీ కూటమి పని చేస్తుందని జనసేన పార్టీ అధినేత కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. అనకాపల్లి జిల్లా ఎలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురంలో ఈరోజు నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రానికి మేలు చేసే విధంగా కూటమి కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వచ్చిందని అన్నారు.

==============================

దేశంలో చమురు కంపెనీలు వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాయి. 19 కిలోల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధరను 19 రూపాయలు తగ్గిస్తున్నట్లుగా చమురు కంపెనీలు తెలిపాయి. తగ్గించిన ధరలు ఈ రోజు నుంచే అమల్లోకి వచ్చాయని ప్రకటించాయి. అయితే ఇళ్లలో వంటకు వినియోగించే గృహోపకరణ సిలిండర్ల ధరలను తగ్గించలేదని చమురు కంపెనీలు పేర్కొన్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

జిల్లాలో మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని వైద్య అధికారులకు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా పూర్తి అదనపు బాధ్యతలతో డాక్టర్ కె.విజయ నియమితులయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ నిశాంత్ కుమార్ ను ఈరోజు మర్యాదపూర్వకంగా ఆమె కలుసుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

విజయవాడలోని ప్రసిద్ధ పుణ్య క్షేత్రం శ్రీ కనక మహాలక్ష్మి అమ్మ వారికి భక్తులు కానుకల ద్వారా సమర్పించిన ఆదాయం ఒక కోటి, 91 లక్షల 27 వేల 261 రూపాయలుగా ఉందని ఆలయ కార్యనిర్వహణాధికారి కే.ఎస్.రామారావు తెలిపారు. అలాగే, 370 గ్రాముల బంగారం, 3 కిలోల 850 గ్రాముల వెండిని కానుకలుగా ఇచ్చారని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =